క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు



ఫిరంగిపురం: మండలంలోని కండ్రిక వెల్లేదారిలో ఉన్న శ్రీషిర్డీసాయినాథ ఆలయ నాలుగో వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే అర్చకుడు పీసపాటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో విశ్వక్షేన పూజ, మండపారాధన, పుణ్యాహవాచనం, అంకురారోహణ కార్యక్రమాలు నిర్వహించి స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం ఐదురకాల పుష్పాలతో అష్టోత్తర, సహస్రనామ అర్చనలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

నేటి నుంచి రేషన్ దుకాణాల వద్దే పంపిణీ

ఫిరంగిపురం: ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఎండీయూ వాహనాలు రద్దు చేయడంతో రేషన్ దుకాణాల వద్దనే కార్డుదారులకు రేషన్ సరుకుల పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ జె.ప్రసాదరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి మండలంలోని 42 రేషన్ దుకాణాల వద్ద కార్డుదారులకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ అందజేయాలన్నారు.

నరసింహస్వామి దేవస్థానం ఈఓగా సునీల్ కుమార్



మంగళగిరి టౌన్: మంగళగిరి నగరపరిధిలో వేంచేసి యున్న శ్రీ నరసింహస్వామి దేవస్థానం నూతన ఈఓగా కోగంటి సునీల్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. దుగ్గిరాల మండల పరిధిలోని కంతంరాజు కొండూరులోని మహంకాళీ అమ్మవారి దేవస్థాన కార్యనిర్వహణాధికారిగా విధులు నిర్వర్తించిన సునీల్‌కుమార్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన రామకోటిరెడ్డి ఉద్యోగ విరమణ కావడంతో శుక్రవారం ఆయన్ను దేవస్థాన అధికారులు రిలీవ్ చేసినట్లు తెలిపారు.

డ్రెయిన్లలో పూడికతీత



తాడేపల్లి రూరల్: మంగళగిరి – తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణ పరిధిలో ప్రధాన రహదారిలో శనివారం పారిశుద్ధ్య కార్మికులు పూడికతీత పనులు చేపట్టారు. ప్రధాన రహదారి వెంబడి అంజయ్య కొట్టు దగ్గర నుంచి పురం సెంటర్ వరకు డ్రైనేజీ పూర్తిగా సిల్ట్‌తో పూడుకుపోయి మురుగునీరు రోడ్డుపైకి రావడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు కార్పొరేషన్ సిబ్బంది ఆ సిల్ట్‌ను తొలగించారు.

కాపు కార్పొరేషన్ చైర్మన్‌ను కలసిన ప్రజా కాపునాడు నేతలు

తాడేపల్లి రూరల్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజా కాపునాడు నాయకులు శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని కాపు కార్పొరేషన్ కార్యాలయంలో చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడును మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ప్రజా కాపునాడు నాయకులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. స్పందించిన సుబ్బారాయుడు సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి కాపునాడు అధ్యక్షుడు పుల్లెపు భాస్కరరావు, ప్రచార కార్యదర్శి అడపా నరేష్, ఉప కార్యనిర్వాహక కార్యదర్శి మొలబంటి వెంకటేష్, సెక్రటరీ కొత్తూరు వెంకట రామమోహన్‌రావు, ఉప సెక్రటరీ గాజుల కృష్ణారావు, పసుపులేని రాజశేఖర్, అల్లమల్ల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పొగాకుతో పలు రకాల ఆరోగ్య సమస్యలు



దుగ్గిరాల: దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ ఇందిర మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మే 31న పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తారని, పొగాకులోని నికోటిన్ అనే రసాయనిక పదార్థం వల్ల శారీరక, మానసిక సమస్యలు ఉత్పన్నం అవుతాయన్నారు. ఊపిరితిత్తులు, నోటి క్యాన్సర్, మానసిక ఒత్తిడి, రక్తపోటు వంటి సమస్యల వల్ల జీవితాలు చిన్నాభిన్నం అవుతాయని తెలిపారు.

భూమికి బలం.. కాపరికి లాభం

- సారం కోసం పొలాల్లో గొర్రెల మందలను నిలుపుతున్న రైతులు
- గొర్రెల విసర్జితాలతో పెరగనున్న భూసారం
- భేషుగ్గా పనిచేస్తున్న పూర్వీకుల పద్ధతి



పొలంలో మేత మేస్తున్న గొర్రెలు

తాడేపల్లి రూరల్: అధిక దిగుబడులు సాధించాలని రైతులు విచక్షణా రహితంగా రసాయన పురుగు మందులు, ఎరువులు వాడడం వలన భూములు నిర్జీవంగా మారుతున్నాయి. దీంతో పంటలకు మేలు చేసే అనేక రకాల సూక్ష్మ జీవులు వాటి ద్వారా లభించే సేంద్రియ పదార్థాలు సూక్ష్మ పోషక పదార్థాలు పూర్తిగా నశించి పంటల ఎదుగుదల లోపిస్తుంది. రైతులు సేంద్రియ, పశువులు, గొర్రెల ఎరువు ద్వారా సమగ్ర ఎరువుల యాజమాన్య విధానాలతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

పాత పద్ధతి.. సరికొత్త లాభాలు

ప్రస్తుతం పంటల కాలం పూర్తి కావడంతో రైతులు దుక్కులు దున్నడం, భూమిలో సారం పెంచేందుకు పశువుల ఎరువులు వేయడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం పాడి పరిశ్రమ గిట్టుబాటు కాక తక్కువ సంఖ్యలోనే పశువులను పెంచుకుంటున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాలలో పశువుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో పశువుల ఎరువుకు కరువు ఏర్పడింది. ఈ నేపథ్యంలో గొర్రెల మంద కట్టించి సాగు భూమికి ఎరువు అందిస్తున్నారు రైతులు. వ్యవసాయ రంగం అధునాత పద్ధతులలో ఎన్ని కొత్త పుంతలు తొక్కుతున్నప్పటికీ రైతులు కొన్ని పాత విధానాల్లో భూసారం పెంచే ప్రక్రియ మెచ్చుకోతగింది.

రోజుకు రూ.వెయ్యి నుంచి 1500 వరకు..

గొర్రెల మందలను పొలాల్లోనే ఉంచి వాటి మలవిసర్జితాలను ఎరువుగా ఉపయోగించే పద్ధతులను మళ్లీ ముమ్మరం చేస్తున్నారు. ఈ ఏడాది కూడా మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో స్థానిక గొర్రెల పెంపకం దారులతో పాటు, కృష్ణా, ఎన్టీఆర్ తదితర జిల్లాల్లో ఉన్న గొర్రెల కాపరులతో ఒప్పందం కుదుర్చుకుని, వారి మందలను రాత్రిళ్లు తమ పొలాల్లో రైతులు ఉంచుతున్నారు. గొర్రెలకు ఆ రోజు మేతతో పాటు గొర్రెల సంఖ్యను బట్టి ఎకరాకు రూ.వెయ్యి నుంచి 1500 వరకు కాపరులకు ఇస్తున్నారు. ఇలా 3 నుంచి 4 రోజుల పాటు ఈ విధానంలో వేలాది ఎకరాలలో మంద కట్టించి భూసారం పెంచుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఈ ఖరీఫ్, రబీకి మధ్యకాలంలో పంట పొలాల్లో గొర్రెలను తిప్పడం ద్వారా గొర్రెలకు ఆహారం లభించడంతో పాటు గొర్రెలు విసర్జించే మల మూత్రాలు పొలాలకు ఎరువుగా ఉపయోగపడతాయి. ప్రస్తుతం గొర్రెల మందలను పంట పొలాల్లో మంద కట్టేందుకు మునుపెన్నడూ లేని విధంగా రైతులు ఆసక్తి చూపుతున్నారు.

గొర్రెల ఎరువుతో ఎంతో మేలు



పంట పొలాల్లో గొర్రెలను నిలపడం ద్వారా రసాయనిక ఎరువులు వేయకుండానే భూసారాన్ని పెంచుకోవచ్చు. గొర్రెలు మందకట్టడం ద్వారా సంప్రదాయ పద్ధతిలో భూసారం పెరుగుతుంది. గొర్రెల మందను ఉంచడం వలన వాటి విసర్జన వల్ల పంటల దిగుబడి పెరుగుతుంది. రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడడం పెరిగిన నేపథ్యంలో భూమిలో సూక్ష్మ పోషకాలు అంతరించి పంటలు సరిగా పడడం లేదు. గొర్రెల ఎరువులో నత్రజని, భాస్వరం, పొటాషియం సమృద్ధిగా ఉండి నేల సారం పెరిగి సేంద్రియ పదార్థాన్ని అందిస్తుంది. నత్రజని మొక్కల ఎదుగుదలకు, ఆరోగ్యంగా పెరిగేందుకు దోహదం చేస్తుంది. భాస్వరం వేర్ల అభివృద్ధికి ఆరోగ్యకరమైన ఉత్పత్తుల దిగుబడికి, అదేవిధంగా పొటాషియం మొక్కల ఆరోగ్యం, తెగుళ్ల, చీడ పీడలను తట్టుకునే శక్తిని అందజేస్తుంది.

– పి.శిరీష, వ్యవసాయ అధికారి, దుగ్గిరాల

సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

మంగళగిరి టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో గానీ, సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కానీ విఫలమైందని ఆంధ్రరాష్ట్ర సమితి (ఏఆర్ఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరి నగర పరిధిలోని ఆంధ్రరాష్ట్ర సమితి కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం అయినా నేటి వరకు రాజధాని రైతులకు చేసింది ఏమీలేదన్నారు. తొలివిడత ల్యాండ్ పూలింగ్‌లో తీసుకున్న భూమిని ఇంతవరకు అభివృద్ధి చేయలేదని, మరో విడత ల్యాండ్ పూలింగ్‌లో 40వేల ఎకరాలను ఇవ్వాలని చంద్రబాబు అంటున్నారని, నేటి ధర ప్రకారం రైతులకు ఎకరానికి రూ.కోటి చెల్లించాలని డిమాండ్ చేశారు. రాజధాని ప్రాంతంలో ప్రతి రైతుకు 1250 గజాలు ఇవ్వాలన్నారు. నారా లోకేష్ రెడ్ బుక్ అంటూ సమయం వృథా చేస్తున్నాడని, పగ ప్రతీకారాలతో కేసులు పెడుతున్నారని విమర్శించారు. త్వరలో ప్రజా ఎదుగుదల యాత్ర ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ యాత్ర ద్వారా రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం చేసిన మోసాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.

విద్యార్థుల ఉన్నత చదువులకు అండ

'పది'లో మంచి మార్కులు సాధించిన పేద విద్యార్థికి రూ.1.20లక్షల చెక్కు అందజేత



విద్యార్థికి ఉన్నత చదువుల నిమిత్తం చెక్కు అందిస్తున్న కడియాల శివప్రసాద్

మేడికొండూరు: విద్యపై ఆసక్తి ఉండి కష్టపడి చదువుకునే నిరుపేద విద్యార్థులకు స్ఫూర్తి ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మేడికొండూరు మండలం సిరిపురం గ్రామానికి చెందిన స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి కడియాల శివప్రసాద్ అన్నారు. గ్రామానికి చెందిన దొరడ్ల జగదీష్ సిరిపురం జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి కష్టపడి చదువుకొని 559 మార్కులతో పాఠశాలలో ప్రథమంగా నిలిచాడు. ఉన్నత చదువులు చదువుకోవడానికి కుటుంబ పరిస్థితి అనుకూలించకపోవడంతో చదువు ఇంతటితో ఆపేయవలసిన పరిస్థితి వచ్చింది. వాళ్ల కుటుంబ పరిస్థితి తెలుసుకున్న స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి కడియాల శివప్రసాద్ ఈ విషయాన్ని ఫౌండేషన్ చైర్మన్ శ్రీవ్యాల్‌కి తెలియపరిచాడు. శ్రీవ్యాల్ వెంటనే స్పందించి విద్యార్థికి కావలసినటువంటి ఆర్థిక సహాయం 1,20,000 చెక్కును ఫౌండేషన్ ప్రతినిధి శివప్రసాద్ చేత విద్యార్థికి శనివారం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ శ్రీ వ్యాల్, శిరీష, ఫౌండేషన్ ప్రతినిధి శివప్రసాద్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మంత్రి నాదెండ్ల మనోహర్



వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలిటౌన్: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఆహార పౌర సరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. శనివారం రూరల్ మండలం కఠెవరం, నందివెలుగు గ్రామాల్లో సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ నిర్వహించారు. మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొని వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు సామాజిక భద్రత పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో అత్తోట దీప్తి, కఠెవరం సర్పంచ్ బండికళ్ళ ప్రసాద్, నందివెలుగు సర్పంచ్ దూళ్ళిపాళ్ళ పవన్ కుమార్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

సుబ్బారావు సేవలు ప్రశంసనీయం



డీఈ సుబ్బారావును సన్మానిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న, తదితరులు

తెనాలి అర్బన్: సుబ్బారావు సేవలు ప్రశంసనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్నలు పేర్కొన్నారు. మున్సిపల్ డీఈ రావూరి సుబ్బారావు వీడ్కోలు సభను కౌన్సిల్ హాల్‌లో శనివారం సాయంత్రం నిర్వహించారు. డీఈగా ఆయన అందించిన సేవలను అభినందించారు. శేష జీవితం సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు. అనంతరం సుబ్బారావు దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, కౌన్సిలర్ మట్లపూడి సంధ్యారాణి, ఇన్‌చార్జి ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, డీఈ శ్రీనివాసరావు, మేనేజర్ విల్సన్ జయకర్, ఆర్‌వో రాంప్రసాద్, ఏసీపీలు శివన్నారాయణ, వాణి, పలువురు మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు, డీఈ కుటుంబ సభ్యులు, స్నేహితులు పాల్గొన్నారు.

భారీ మెడికల్ క్యాంపు

తెనాలిరూరల్: సూపర్ స్టార్ కృష్ణ జయంతిని పురస్కరించుకుని విజయవాడకు చెందిన ఆంధ్రా హాస్పటల్స్ ఆధ్వర్యంలో మహేష్‌బాబు స్వగ్రామం బుర్రిపాలెంలో శనివారం భారీ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో వైద్యులు సుమారు 146 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. గుండె జబ్బులు స్క్రీనింగ్ పరీక్షలు, ఎకోకార్డియోగ్రామ్, రక్త పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. డాక్టర్ పీవీ రామారావు, డాక్టర్ ముదస్సిర్, డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ అమర్, డాక్టర్ పవన్, డాక్టర్ రమేష్ వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఉపాధి కూలీలకు వేతనాలు అందజేయాలి

దుగ్గిరాల: కేంద్ర ప్రభుత్వ ఉపాధి హామీ వేతనాలు వెంటనే అందజేయాలని సీపీఎం నాయకుడు జెట్టి బాలరాజు డిమాండ్ చేశారు. శనివారం దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో ఉపాధి హామీ కూలీల సమస్యలను సీపీఎం నాయకులు తెలుసుకున్నారు. అనంతరం బాలరాజు మాట్లాడుతూ ఉపాధి కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వాలని, వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్.బుజ్జి, వెంకటేశ్వర రావు, రాంబాబు. తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ టాపర్‌కి నగదు ప్రోత్సాహకం



దుగ్గిరాల: ఇటీవల జరిగిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో దుగ్గిరాల మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థినికి గివింగ్ బ్యాక్ టూ సొసైటీ ఆధ్వర్యంలో ప్రోత్సాహక నగదు అందజేశారు. రేవేంద్రపాడు గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని ఉమా మహేశ్వరికి తహసీల్దార్ సునీత చేతులమీదుగా రూ.10వేలు అందించారు. సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో చర్చి దగ్ధం



పెదవడ్లపూడి(మంగళగిరి): మంగళగిరి – తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఆత్మకూరు గ్రామంలోని దయాసదన్ చర్చిలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. శనివారం విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనల్లో వుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి అగ్ని ప్రమాదం సంభవించింది. ఘటనలో చర్చి పూర్తిగా దగ్ధమవగా, ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు ప్రాణాలతో బయటపడి ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక యంత్ర సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకురావడంతో ప్రమాదం తప్పింది. రూ.కోటి ఆస్తినష్టం జరిగిఉంటుందని అంచనా.

అర్బన్ మార్కెట్ సేవలు ఉపయోగించుకోండి



తెనాలిఅర్బన్: అర్బన్ మార్కెట్ సేవలను అందరూ ఉపయోగించుకోవాలని మెప్మా సీఎంఎం విజయకుమారి పేర్కొన్నారు. తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వయం సహాయక సంఘ సభ్యులు తయారు చేసిన వస్తువులకు మార్కెట్ కల్పించేందుకు ప్రభుత్వం అర్బన్ మార్కెట్‌లను ప్రతినెలా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతినెలా చివరి శుక్ర, శనివారాల్లో దీనిని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మెప్మా ఉద్యోగులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక నాయకుడు జెట్టి బాల రాజు

దుగ్గిరాల: ప్రజాసమస్యల పరిష్కారం కోరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కార్మిక నాయకుడు జెట్టి బాలరాజు కోరారు. శనివారం సీపీఎం దుగ్గిరాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చాలని, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకం భూమి లేని రైతులకూ వర్తింప చేయాలని, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం సత్వరం అమలు చేయాలని, ఇళ్లు లేని నిరుపేదలకు స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 2న ధర్నా చేయనున్నామన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. వై.బ్రహ్మేశ్వరరావు, బి.అమ్మిరెడ్డి, నార్ల వెంకట రామయ్య పాల్గొన్నారు.

సూపర్‌స్టార్ కృష్ణ జయంతి వేడుకలు



కేక్ కట్ చేస్తున్న లింగంశెట్టి కిషోర్ కుమార్, ప్రసాద్

తాడేపల్లి రూరల్: సినీనటుడు, దర్శకుడు సూపర్‌స్టార్ కృష్ణ జయంతి వేడుకలను శనివారం ఉండవల్లి సెంటర్‌లో లింగంశెట్టి అసోసియేట్స్ కార్యాలయంలో బాలాజీ స్వీట్స్ అధినేత ప్రసాద్, లింగంశెట్టి అసోసియేట్స్ అధినేత లింగంశెట్టి కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కృష్ణ జయంతిని పురస్కరించుకుని కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు సినీ చరిత్రలో సంచలనాలు సృష్టించి నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగానే కాకుండా తెలుగు సినిమాకు సరికొత్త టెక్నాలజీని పరిచయం చేసిన వ్యక్తి సూపర్‌స్టార్ కృష్ణ అని అన్నారు. కృష్ణ అభిమానులు సిగిరిశెట్టి రాజా రమేష్, దాసరి కృష్ణ, మలిశెట్టి పండు, సిగిరిశెట్టి శ్రీనివాసరావు, గోపాలం కొండలరావు, సందు అప్పారావు, కోడె సుబ్బారావు, బసివి రెడ్డి, దుర్గారావు, వెంకటేష్, మిత్ర బృందం తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సినిమాస్థాయి పెంచిన కృష్ణ



దుగ్గిరాలలో కృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

దుగ్గిరాల: తెలుగు సినిమా స్థాయిని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప నటుడు కృష్ణ అని వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకుడు షేక్ సుభాని అన్నారు. కృష్ణ జయంతి వేడుకలు దుగ్గిరాల జెండా చెట్టు సెంటర్ వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సుభాని మాట్లాడుతూ సూపర్‌స్టార్ కృష్ణ తెలుగు సినిమా పరిశ్రమకి అమోఘమైన సేవలు అందించారని. తెలుగు సినీ వినీలాకాశంలో డేరింగ్ అండ్ డాషింగ్ హీరోగా అందరిచేత కొనియాడబడ్డారని పేర్కొన్నారు. పి.యోహోను, షేక్ మస్తాన్, బాజీ బాబా, జాన్ షైదా, వెంకటేశ్వర రావు, బులుసు, శ్రీను, వి.నరసింహరావు. దేవర నాయుడు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వీల్‌చైర్లు పంపిణీ



దివ్యాంగులకు వీల్‌చైర్స్ అందజేస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి సభ్యులు

తాడేపల్లి రూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్, పిడుగురాళ్ల లైమ్ సిటీ రోటరీ క్లబ్స్ షేర్ ప్రాజెక్ట్‌లో భాగంగా తాడేపల్లిలోని పలువురు దివ్యాంగులకు వీల్‌చైర్స్ వారి నివాసాలకు శనివారం వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ప్రాజెక్ట్ డైరెక్టర్ జొన్న రాజేష్, క్లబ్ అధ్యక్షుడు రమేష్‌బాబు మాట్లాడుతూ తాడేపల్లి పట్టణ పరిధిలోని బోసుబొమ్మ సెంటర్, ప్రకాష్‌నగర్, ఎర్రబాలెం ప్రాంతాల్లో ప్రత్యేక వ్యక్తులను గురించి ఐదు వీల్‌చైర్స్ అందజేశామని తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి సెక్రటరీ సుకుమార్ రెడ్డి, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఎలెక్ట్ రామకృష్ణ శెట్టి, డైరెక్టర్లు గోపు నాగరాజేష్, జొన్న కిషోర్, తెలుగుదేశం నాయకులు ఇట్టా భాస్కర్, శివనాగేశ్వర రావు, సూరగాని కిరణ్, దుర్గారావు, సాయిచంద్, రాంబాబు, కిరణ్ జనసేన నాయకులు ఆకుల అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



దీక్షాశిబిరంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

తాడేపల్లి రూరల్: విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాలని కార్మిక నాయకుడు నాగేశ్వర రావు డిమాండ్ చేశారు. శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు 179 రోజులుగా దీక్షలు చేస్తున్నా ఇప్పటి వరకు ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. నారా లోకేష్ ఎన్నికలకు ముందు తమ పార్టీ అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, అంకయ్య, ఇస్మాయిల్, గువరయ్య, నాగేశ్వరరావు, శివమ్మ, రమాదేవి, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఓంకారేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట



ధ్వజస్తంభాన్ని ప్రతిష్టిస్తున్న దృశ్యం



ఓంకారేశ్వరస్వామి మూలవిరాట్

తెనాలి: స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని ఓంకార ఆశ్రమంలో నూతనంగా నిర్మించిన శ్రీపార్వతీ సమేత శ్రీఓంకారేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఆశ్రమ నిధులు, దేవదాయ ధర్మదాయ శాఖ, దాతల సహకారంతో ఆశ్రమంలో పరివార దేవత, శిఖర, ధ్వజస్తంభ, శ్రీ శరభ సాళ్వేశ్వర స్వామి, శ్రీ పార్వతీ సమేత ఓంకారేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట ఉదయం 8.19 గంటలకు జరిపారు. శైవాగమ పండితుడు మామిళ్లపల్లి మృత్యుంజయ ప్రసాద్ శివాచార్య నేతృత్వంలో పండితులు ఆగమోక్తంగా ప్రతిష్టా కార్యక్రమాన్ని జరిపారు. జూన్ 29 తేదీ నుంచి ప్రారంభమైన ప్రతిష్టా మహోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం యంత్ర బింబ, ధ్వజప్రతిష్ట, కళాన్యాసం ,ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాలను నిర్వహించారు. తాళ్లాయపాలెం శ్రీశైవ పీఠాధిపతి శ్రీ శివస్వామి, ఒంగోలులోని సంతు సదానంద గౌరవాధ్యక్షురాలు మహా విద్యానందగిరి మాతాజీ పాల్గొన్నారు. శివ స్వామీజీ, మాతాజీ భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఆశ్రమం కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో తెనాలి గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.